క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



దిల్షాద్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: పట్టణంతో పాటు రూరల్ పరిధిలో వైఎస్సార్‌సీపీ యువనేతలు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన పట్టణంలోని పద్మావతి, తులశమ్మ, కే.దిల్షాద్, రూరల్ పరిధిలోని ఆలూరుకు చెందిన జయరామిరెడ్డికి రూ.4 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారి ఇళ్లకే వెళ్లి అందించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తికి పాముకాటు

యాడికి: తోటలో పొలం పనులు చేసుకుంటున్న వ్యక్తి పాముకాటుకు గురైన సంఘటన వేములపాడులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యుగంధర్‌యాదవ్ పొలంలో జొన్న పంటను పరిశీలించేక్రమంలో పాముపై అడుగు వేయటంతో కాటేసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతడిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి యుగంధర్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఆదర్శ పాఠశాలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సతీష్, పీడీ వెంకటేష్

గార్లదిన్నె: గార్లదిన్నె ఆదర్శ పాఠశాలకు 2022–23 క్రీడా ప్రతిభా పురస్కారం లభించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం అనంతపురం న్యూ టౌన్ ప్రభుత్వ హైస్కూల్‌లో డీఈఓ నాగరాజు రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించిన అవార్డును అందించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, పీడీ వెంకటేష్ తెలిపారు.

పంటలు కాపాడుకోవాలి

శింగనమల: వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, ఇతర పంటలు నీటి ఎద్దడికి గురి కాకుండా కాపాడుకోవాలని పేఓ అన్వేష్‌కుమార్ రైతులకు సూచించారు. రైతులు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు, లేదా 19:19:19 లేదా యూరియా 10 గ్రాములు చొప్పున ఒక లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. కంది, ఆముదం పంటల్లో ఎక్కువ సార్లు అంతర కృషి చేయడం ద్వారా కలుపు నివారణతో పాటుగా నేలను ఆచ్ఛాదన కల్పించడం చేయలని సూచించారు.

కేజీబీవీ తనిఖీ



విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి మంజుల

గుంతకల్లు రూరల్: స్థానిక దోనిముక్కల రోడ్డులోని కేజీబీవీని జూనియర్ సివిల్ జడ్జి జీ. మంజుల మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని రుచి చూశారు. పాఠశాలలోని గదులు, మరుగుదొడ్లను పరిశీలించిన ఆమె విద్యార్థులతో మాట్లాడి భోజనం, ఇతరత్రా సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు తెలియజేశారు. రూరల్ ఎస్‌ఐ సురేష్ ఉన్నారు.

గుండె వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: స్థానిక మౌలానా అబుల్ కలాం అజాద్ ఫంక్షన్ హాలులో మంగళవారం ఫయాజ్‌బాషా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదల ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని శిబిరం ఏర్పాటు చేశామని ఫయాజ్‌బాషా తెలిపారు. ఈసందర్భంగా 297 మందికి కిమ్స్ సవీరా వైద్యులు రామ్‌కుమార్, ఆర్‌ఎండీ అక్రమ్, సురేష్, సాంబ, హయాత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు కె.ఆరీఫ్ సుల్తాన్‌బాషా ఖాద్రీ, ఆరీఫ్ సాహెబ్, దాదా బాషా సాహెబ్, మిన్‌హాజ్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, రియాజ్, హాజీవలి, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, కుమార్, విశ్రాంత ఎస్‌ఐ శ్రీరాములు, జునైద్, గురుప్రసాద్‌రెడ్డి, ఆలూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎస్సీలకు మగ్గం పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: చేనేతల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మగ్గం ఉన్నతీకరణ పథకం కింద 10 మంది లబ్ధిదారులకు మగ్గం పరికరాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలో 84 మంది ఎస్సీ చేనేత కార్మికులకు మగ్గం పరికరాలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సొంత చేనేత మగ్గం కల్గిన ప్రతి కుటుంబానికి మగ్గం ఆధునీకరణ చేసుకునేందుకు నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. నాలుగేళ్లలో 17,750 మంది చేనత కార్మికులకు రూ 4,260.96 లక్షలు నేతన్న నేస్తం కింద అందజేశామని గుర్తు చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఈ ఏడాది 2,159 మంది చేనేత కార్మికులకు రూ.59,37,250 అందించామన్నారు. ఈ ఏడాది 558 మంది చేనేత కార్మికులకు రూ.650.8 లక్షలు బ్యాంకుల ద్వారా రుణాన్ని అందజేశామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డి భార్య తులసమ్మకు సీఎం రిలీఫ్ కింద రూ.1.20 లక్షల చెక్కును మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో చేనేత డీఓ బసవరాజు, ఏడీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, నాయకులు శివకేశవ రెడ్డి, నాగేష్, రషీద్, జిలాన్, హనుమంత రెడ్డి, రామేశ్వర రెడ్డి, దండు రాముడు, మల్లికార్జున, కోనా జగదీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

తాడిపత్రి: పక్షం రోజుల్లోగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్డీటీ కాలనీ సమీపంలోని టిడ్కో గృహాల నిర్మాణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడారు. వచ్చే నెలాఖరుకు గతంలో మీరు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని చెప్పానని, ఆమేరకు పనులు చేయాలన్నారు. దాదాపు 3 వేల మంది లబ్ధిదారులకు 35 బ్లాక్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులను పర్యవేక్షిస్తున్న హౌసింగ్ ఏఈ యుగంధర్‌తో మాట్లాడారు. అనంతరం జగనన్న కాలనీలో ఆప్షన్ త్రీ ఇళ్లతో పాటు వ్యక్తిగతంగా లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి రోగులకు త్వరగా అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పక్కాగా ఓట్ల తొలగింపు



ఆకులేడులో ఓట్ల తొలగింపును పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

శింగనమల: ఓటర్ల తొలగింపును పకడ్బందీగా చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె ఆకులేడు, నాగులగుడ్డం, వెస్ట్ నరసాపురంలో ఓట్ల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈడీటీ రామకృష్ణ, ఉన్నారు.

పెద్దవడుగూరు: ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం మల్లేనిపల్లిలో ఓటరు జాబితా సవరణను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ నాగభూషణ, సిబ్బంది ఉన్నారు.

యాడికి: చిక్కేపల్లెలో మంగళవారం డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ఓట్ల తొలగింపుపై విచారణ చేపట్టారు. తాడిపత్రి ఎన్నికల అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ అలెగ్జాండర్, ఆర్‌ఐ ఆనందబాబు, ఏపీఎం చంద్రశేఖర్ ఉన్నారు.

గుత్తి: ఐ పట్టణంలోని జెండా వీధిలో ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ మహబూబ్‌బాషా ఓటరు జాబిత సవరణను పరిశీలించారు. ఈసందర్భంగా వారు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌ఐ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



ఆలూరులో పర్యటిస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ సరస్వతి

తాడిపత్రి: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆలూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్బీకే, గ్రామ సచివాలయ సేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ సరస్వతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, ఆలూరు రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుత్తి: సత్యసాయి కార్మికులు సమ్మెతో గుత్తిలో తాగునీటి సమస్య నెలకొందని, వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కలెక్టర్ గౌతమిని కోరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా కార్యదర్శులు గురుప్రసాద్ యాదవ్, రాజ్‌కుమార్ రెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా వైటీ చెరువుకు, అక్కడి నుంచి గుత్తి చెరువుకు నీళ్ల వదలాలన్నారు. సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని విన్నవించారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కౌన్సిలర్లు వాల్మీకి శివ, నజీర్, వరదరాజులు, ఫరూక్, కేవీ రమణ, నరేష్, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, వార్డు ఇన్‌చార్జులు మర్తాడ్ అన్సార్, హమాలి రామాంజి, బింగి కిరణ్‌బాబు, గ్రానైట్ శివ, సునీల్, అరటి పండ్ల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘కుట్ర రాజకీయాలు టీడీపీకే చెల్లు’

యాడికి: కుట్ర రాజకీయాలు చేయడం టీడీపీకే చెల్లు అని, నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భోగాతి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ నేత కులశేఖర్ నాయుడుకు లేదన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రైతు బిడ్డ కావడంతో రాయలచెరువు చెరువు, యాడికి కాలువకు ఏటా నీరు ఇవ్వటంతో ప్రస్తుతం బోర్లల్లో నీరు పుష్కలంగా వస్తోందన్నారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు డ్రైనేజీలు కనబడలేదా అని ప్రశ్నించారు. కులశేఖర్ నాయుడు తన స్థాయికి తగ్గట్లు నడుచుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, శివకేశవ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేష్, రామ్మోహన్, మారుతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశానికి ఆప్షన్ ఎంపిక

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2లోపు వెబ్ ఆప్షన్స్(జీటీకేఎల్) ఎంపిక చేసుకోవాలని కళాశాల ఓఎస్‌డీ డాక్టర్ ధీరేంద్ర బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం రెండో విడత వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. గుంతకల్లు కళాశాల కోడ్ కోడ్ ‘జీటీకేఎల్’ అని ఆయన తెలిపారు. వివరాలకు 8074645615 నంబరులో సంప్రదించాలని కోరారు.

భూ సమస్యపై ఘర్షణ

యల్లనూరు: గడ్డంవారిపల్లిలో మంగళవారం బయన్నగారి పెద్దిరాజు, కుడుముల రామాంజులరెడ్డి మధ్య పొలాల గట్ల విషయమై ఘర్షణ జరిగింది. ఘర్షణలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై ఎస్‌ఐ రామకృష్ణ విచారణ చేపట్టారు.

బెట్ట నివారణ చర్యలు చేపట్టండి



రైతులకు సలహాలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: వర్షాభావంతో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు బెట్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్.నటరాజ్, డాక్టర్.శ్రీనివాసులు, ఏడీఏలు వెంకట్రాముడు, మద్దిలేటి, ఏఓ శ్రీనివాసులు రైతులకు సూచించారు. మంగళవారం వారు కరిడికొండ, బాచుపల్లి, వన్నేదొడ్డి పొలాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది, పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెట్ట పరిస్థితుల్లో రైతులు పంటలు కాపాడుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున పొటాషియం నైట్రేట్ (13:00:45) ద్రావణాన్ని ఒక ఎకరాకు 200 లీటర్లు, ఐదు నుంచి ఆరు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పైవి వినియోగించని పక్షంలో (19:19:19) ఎరువును లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని ఆరు రోజుల లోపు రెండు సార్లు పంటలపై చల్లాలన్నారు. ఒక లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున యూరియా ద్రావణాన్ని ఒక ఎకరాకు 200 లీటర్ల చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పంటలపై పిచికారీ చేయాలన్నారు. ఏఓలు డాక్టర్.సహదేవ, మంజుల, వీఏఏ అజేయుడు, వీహెచ్‌ఏ బాలరాజు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన రైతులకు సూచించారు. మంగళవారం తాడిపత్రి మండలం రావి వెంకటాంపల్లి, తేరన్నపల్లి, దిగువపల్లిలో వేరుశనగ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వర్షాభావంతో వేరుశనగలో బెట్ట పరిస్థితి నెలకొందన్నారు. మొక్కజొన్న సాగులో యజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. తాడిపత్రి ఏఓ మహతి, మురళి, స్వాతి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చట్టాలపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొర్రపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పుట్లూరు: మండలంలోని దోశలేడు గ్రామానికి చెందిన హేమలత(22) అనే వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. వివరాలు... కడుపునొప్పి తాళలేక ఈ నెల 27న హేమలత పురుగులు మందు తాగింది. కుటుంబ సభ్యులు బెంగళూరు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: చిన్నపొలమడలో పసుపులేటి నాగేంద్ర అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సెబ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నాగేంద్రపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్ మృతి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని బండా మసీదు సమీపంలోని డాక్యుమెంట్ రైటర్ చాంద్‌బాషా(57) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. తాడిపత్రి డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు చాంద్‌బాషా చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

పెద్దపప్పూరు: ఎంపీపీ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ 4న ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నిక నిర్వహిస్తారని, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

పాఠశాల తనిఖీ

గుత్తి రూరల్: బసినేపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం తహసీల్దార్ మహబూబ్ బాషా తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగు తదితర వస్తువులను పరిశీలించారు. సర్పంచ్ సుశీలమ్మ, ఎంపీటీసీ శంకరమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా నేత లాలునాయక్ పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి

పామిడి: రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె రామగిరిలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

జెడ్పీటీసీ భాస్కర్‌కు సన్మానం

బుక్కరాయసముద్రం: జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ (ఫుడ్ అడ్వయిజర్) సభ్యుడిగా నియమితులైన జెడ్పీటీసీ భాస్కర్‌ను ఏపీఎస్పీ 14వ బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, వైస్ ఎంపీపీ రామగోపాల్, మాదన్న, వీర నారాయణ, మురళి, మహేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ విజయ భాస్కర్, ఎంఈఓ లింగానాయక్ పేర్కొన్నారు. మంగళవారం రెడ్డిపల్లి, రేకులకుంట సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈఓఆర్‌డీ దామెద రమ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ కమిటీ సభ్యురాలిగా సంధ్యారాణి

గార్లదిన్నె: జిల్లా స్థాయి విజిలెన్స్ , ఫుడ్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా గార్లదిన్నె జెడ్పీటీసీ సంధ్యారాణి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఈసందర్భంగా ఆమె తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యసలహాదారు ఆలూరి సాంబశివారెడ్డికి కతజ్ఞతలు తెలియజేసింది.

రెండిళ్లలో చోరీ

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని రెండిళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... వలంటీర్ రవి కుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి సోమవారం నంద్యాలకు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకోగా తాళాలు బద్దలుగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలో దాచిన రూ.లక్ష నగదుతో పాటు ఓ జత బంగారు కమ్మలు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే ప్రాంతానికి చెందిన అర్చకుడు రంగనాయకులు సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి విరుపాపురం వెళ్లి, మంగళవారం తిరిగి వచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలో ఉన్న రూ. 50 వేలు నగదు,3 తులాల బంగారు చైన్, రెండు బంగారు ఉంగరాలు, రెండు జతల కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నివాసముండే శ్రీనివాసులు అనే వ్యక్తి మంగళవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి దారుణ హత్య

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కోర్టుకు హాజరై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి వేటకొడవలితో అతికిరాతకంగా నరికాడు. హతుడు లక్ష్మన్న ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామవాసి. లక్ష్మన్న నార్పల మండలం కాసేపల్లెలో నివాసం ఉంటున్నారని, కుటుంబసభ్యుల వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



భువన విజయం నాటక ప్రదర్శనలో రోటరీ హైస్కూల్ విద్యార్థులు



విజేతలకు బహుమతులను అందిస్తున్న అర్బన్ సీఐ హమీద్‌ఖాన్

గుంతకల్లుటౌన్: తెలుగులో వాడుక బాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక బాషలోకి తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, వనజమ్మ, గోపినాయక్ పాల్గొన్నారు.

అలరించిన భువన విజయం

రోటరీ హైస్కూల్‌లో విద్యార్థులు పదర్శించిన భువన విజయం నాటకం అందరినీ అలరించింది. పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, రోటరీ కార్యదర్శి శివానంద, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు రేణుక, సంయుక్త కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: నెలగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో మంగళవారం మాతృబాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి జయంతి) , జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక రకాల జాతీయ నాయకుల వేషధారణలతో అలరించారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి తెలుగు భాషా ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదర్శ పాఠశాల, కేజీబీవీల్లో కార్యక్రమం జరిగింది.

పెద్దవడుగూరు : విరుపాపురం ఎంపీయూపీ, పెద్దవడుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాముడు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి అందించిన సేవలను వివరించారు. అనంతరం బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడు చితంబర రెడ్డి, ఎంఈఓ రాముడును సన్మానించారు.

యాడికి: రాయలచెరువు ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం రాయలసీమ నాణేల సేకరణ సంఘం ఆధ్వర్యంలో యాడికి కానిస్టేబుల్ విష్ణుభగవాన్ నాణేల ప్రదర్శన నిర్వహించారు. సీవీఆర్ స్కూల్ యాజమాన్యం లారెన్స్‌బాబు రాయలసీమ కాయిన్స్ సొసైటీకి రూ.10 వేలు అందించారని విష్ణు భగవాన్ తెలిపారు.

తాడిపత్రి అర్బన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని అర్బన్ సీఐ పి.హమీద్‌ఖాన్ పేర్కొన్నారు. జాతీయా క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక అరబిందో శత జయంతి పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు క్రీడా పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈఓ నాగరాజు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రమేష్‌బాబు, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, సభ్యులు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు నాగవీరారెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రి: ఆటో నగర్ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష ప్రాముఖ్యతను కళాశాల తెలుగు భాషా విభాగాధిపతి ఎం. విజయభాస్కర్ తెలియజేశారు. పట్టణంలోని, పెద్దపప్పూరు మండలంలోని మౌర్య ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల ఛైర్మన్ లక్కినేని ఆంజినేయులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక స్వరరాగ నాటక కళాసమితి ఉచిత శిక్షణాలయంలో మంగళవారం తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాటక రంగ కళాకారుడు పీసీ రత్నరాజు తెలుగుభాష ఔన్నత్యాన్ని వివరించారు. కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ పశువైద్యాధికారి దేవరాజు, సీనియర్ కళాకారుడు పుంజా కృష్ణారావుయాదవ్, తెలుగుభాష కోవిదుడు, డైరెక్టర్ బెస్త సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. కళాకారులు నాగరాజు, నాగార్జున, దస్తగిరి, దుర్గేష్, కుళ్ళాయి, రామకృష్ణ, చితంబరయ్య పాల్గొన్నారు.

శింగనమల: సోదనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వివేకనంద, మధురెడ్డి, పరిమళ, సురేష్, పీఈటీ బయపరెడ్డి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

యల్లనూరు: తిరుమలాపురంలో మద్యం విక్రయిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

గుత్తి: పాత బస్టాండ్ ఏరియాలోని గ్రంథాలయాన్ని మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయాధికారి రామాంజనేయులు ఉన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో మట్కా రాస్తున్న అంబేడ్కర్‌నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ, ఆసుపత్రిపాలెంకు చెందిన పామెల్ల రామయ్య, తాడిపత్రి మండలం వెలమకూరుకు చెందిన చెన్నారెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.26,340 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.